క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 వితరణ



వితరణ అందిస్తున్న మాజీ కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునఃనిర్మాణానికి బల్లేపల్లి 3వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొనకంచి సరళ, వరప్రసాద్ దంపతులు రూ.1,01,116 ఆలయ కమిటీ వారికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కర్, సూరంశెట్టి నర్సింహారావు, గుండోజి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

కోలాటంలో రాజేశ్వరపురం బృందానికి బహుమతి

నేలకొండపల్లి: కోలాటం పోటీల్లో రాజేశ్వరపురం బృందం ప్రతిభ చాటింది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలులో శనివారం నిర్వహించిన కోలాటం పోటీల్లో రాజేశ్వరపుం జట్టుకు ద్వితీయ బహుమతి లభించింది. సర్పంచ్ దండా పుల్లయ్య కోలాటం శిక్షణతో బహుమతి సాధించామని కోలాట బృందం తెలిపింది. ఈమేరకు సర్పంచ్‌కు బహుమతి అందించి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రమంలో శనివారం రిటైర్డ్ ఆరోగ్యశాఖ ఉద్యోగి దొడ్డపనేని కనకయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు ఫౌండేషన్‌లోని 250 మంది అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు, కనకయ్య సతీమణి సత్యవతి, కుమారుడు అరవింద్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ గిరిజన సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంరూరల్: మండలంలోని చిన్నతండాలో శనివారం తెలంగాణ గిరిజన సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రాంమూర్తి మాట్లాడుతూ.. గత ఇరవైఏళ్లుగా సమాఖ్య గిరిజనుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. నూతన పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, నూతన భవనాలు మంజూరయ్యే విధంగా కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు బి.రాంకోటి, ఎ.కిషన్, జగన్, బి.మంగీలాల్, బి.ప్రసాద్, సక్రాం తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం సాయిప్రభాత్ నగర్‌కు చెందిన దీప ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్రచౌహాన్ డిమాండ్ చేశారు. బాధితురాలు దీప దంపతులు నరసింహారావుతో కలిసి ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి కుదుర్చుకున్న ఒప్పందం కాకుండా అదనంగా కావాలని గిరిజనులను ఒత్తిడి చేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: దంపతుల దాడితో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొక్కిరేణిలో ఓ రైతు వద్ద గోవింద వెంకన్న, పల్లెల చిరంజీవి (35) పాలేర్లుగా పనిచేస్తుండగా పని విషయమై జరిగిన గొడవతో చిరంజీవిపై ఈ నెల 5న వెంకన్న దాడి చేశాడు. ఆ మరుసటి రోజు ఆయన భార్య కౌలస్య కూడా చిరంజీవిపై దాడి చేయగా ఆయన చేను వద్ద పురుగులమందు తాగాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోవింద వెంకన్న, కౌసల్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, చిరంజీవి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌టీపీ నాయకులు కొత్త బాలాజీరావు, వాలూరి సత్యనారాయణ, ఆలేటి రాములు పరామర్శించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	వారసుడు, టైటానిక్
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	అమిఘోస్

- ఖమ్మంవ్యవసాయం

ఊరంతా ఉద్యోగులే..!

ఉన్నత విద్యకు, ఉద్యోగులకు వేదికగా రామచంద్రాపురం

- 110 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు
- 50 మందికి పైగా విదేశాల్లో స్థిరపడిన గ్రామస్తులు
- ఆదర్శ గ్రామంగా నిలుస్తున్న వైనం



పాఠశాలకు అదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అందించిన బల్లలు

సండే స్పెషల్

అది ఒక మారుమూల గ్రామం.. ఎర్రబస్సు కానీ, రవాణా సౌకర్యం కూడా లేని ఓ చిన్న పల్లె. అయితేనేమీ ఉన్నత చదువులకు పెట్టినిల్లు. విదేశీ ఉద్యోగులకు వేదికగా మారిన గ్రామం. అటెండర్ నుంచి జిల్లాలోని వివిధ శాఖల అధికారుల వరకు ఈ గ్రామంలో ఉన్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.. కానీ ఇది నిజం. విదేశాల్లో దాదాపు 50 మందికి పైగా ఉద్యోగరీత్యా స్థిరపడ్డారంటే ఆ గ్రామం విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. నేటితరంలో కూడా ఇంజనీరింగ్‌తో పాటు అనేక విభాగాల సరస్వతి పుత్రులు ఈ గ్రామంలో ఉన్నారు. ఉన్నత విద్యకు, ఉద్యోగులకు వేదికగా మారి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం రామచంద్రాపురం. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..





రామచంద్రాపురంలోని ప్రధాన వీధి (ఇన్‌సెట్) గ్రామంలోని పాఠశాల

నేలకొండపల్లి: మండలానికి చెందిన రామచంద్రాపురం ఓ మారుమూల గ్రామం. అక్కడకు కనీసం రవాణా సౌకర్యం లేకపోవటంతో చాలా కాలం వరకు చదువు గురించి తెలియలేదు. 1942లో మూడో తరగతి వరకు ఉర్దూ మీడియంలో బోధించేవారు. కాగా, 40 ఏళ్ల క్రితం అప్పటి ఉపాధ్యాయులు వి.నారాయణరెడ్డి, శ్రీరాములు, లక్ష్మయ్య, పూర్ణచందర్‌రావు, సీహెచ్.నాగేశ్వరరావులు విద్య వైపు ప్రజల దృష్టిని మళ్లించి ఉన్నత చదువులకు మార్గం చూపారు. ఇప్పుడు ఆ గ్రామంలో ఇంటికో ఇంజనీర్, పోస్టుగాడ్యుయేట్‌లు ఉన్నారు. ప్రస్తుతం ఈ గ్రామం నుంచి 110 మందికి పైగా వివిధ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థి సంఘంగా ముందడుగు..

ఈ గ్రామం నుంచి వివిధ శాఖల్లో స్థిరపడిన ఉద్యోగులు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పూర్వ విద్యార్థి సంఘంగా ఏర్పడి ముందడుగు వేశారు. ఈనేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో విద్యకు బాటలు వేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పాఠశాలలకు విలువైన బెంచీలు, కుర్చీలు ఇతరాత్రా మెటీరియల్లను అందిస్తున్నారు.

విదేశాల్లోనూ రాణిస్తున్న 50 మంది..

ఈ గ్రామంలో చదువుకున్న వారి పిల్లలు దాదాపు 50 కుటుంబాలు విదేశాల్లో స్థిరపడ్డారు. అమెరికా, లండన్, కెనడా, సౌత్‌కొరియా తదితర దేశాల్లో డాక్టర్లు, ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. రామచంద్రాపురం ప్రస్తుతం బస్సు సౌకర్యం లేకపోయినప్పటికీ రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించటంతో ప్రతీ ఇంటి నుంచి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ గ్రామాన్ని చూసి ఇతర గ్రామస్తులు అసూయ పడేలా అభివృద్ధి చెందుతున్నారు. విద్యను ఈ గ్రామ రూపురేఖలు మారుస్తున్నాయని అనేక మంది చెబుతున్నారు.

ఉద్యోగుల వివరాలిలా..

పోలీసు శాఖలో ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం ఆర్‌అండ్‌బీ ఈఈగా పని చేస్తున్న శ్యామ్‌ప్రసాద్, ఇండియన్ నేవీలో లెఫ్టినెంట్ కమాండర్‌గా ఎల్.కార్తీక్‌రెడ్డి పని చేస్తున్నారు. అంతేకాక పోలీస్ శాఖలో వివిధ జిల్లాలో నలుగురు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, కానిస్టేబుల్స్ 15మంది, న్యాయవాదులు ముగ్గురు, ఉపాధ్యాయులు 30 మంది, ఆర్టీసీలో 10 మంది, పోస్టల్ శాఖ, సింగరేణి, వివిధ ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న వారు దాదాపు 110 మంది వరకు ఉన్నారు. అనేక మంది జిల్లాస్థాయి అధికారులుగా, ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో పని చేసి ఇటీవలే పదవీ విరమణ పొందారు.

విద్యతోనే మార్పులు..



విద్యతో ప్రతీ ఒక్కరి జీవితాల్లో మార్పులు వస్తాయి. కనీస సౌకర్యాలు లేనప్పటికీ కష్టంతో కాకుండా ఇష్టపడి చదువుకున్నాం.ఇప్పుడు ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. చదువు విలువను తెలుసుకుని జీవితంలో స్థిరపడాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ, ఆదిలాబాద్ జిల్లా

విదేశాల్లో స్థిరపడ్డా..



చదువు వల్లనే ఇప్పుడు విదేశాల్లో స్థిరపడ్డా. ఆది నుంచి కూడా మా గ్రామంలో విద్యకు విలువ ఇవ్వడంతో 80 శాతం వరకు అక్షరాస్యత ఉంది. డాక్టర్లుగా, ఇంజనీర్లుగా దాదాపు 100 మంది ఉన్నారంటేనే విద్య విలువ ఏంటో అర్థం చేసుకోవచ్చు.

– పి.రాకేష్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(యూఎస్‌ఏ)

1942లోనే బడి ఉంది..



సరస్వతీపుత్రులకు నిలయంగా రామచంద్రాపురం ఉంది. 1942లోనే ఉర్దూ మీడియం స్కూల్ ఉంది. అప్పట్లోనే ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక అటెండర్ ఉండేవారు. చుట్టు పక్కల గ్రామాల వారే మా గ్రామానికి వచ్చేవారు. 1957 నుంచి తెలుగు మీడియం స్కూల్ ఉన్నట్లు పూర్వీకులు తెలిపారు.

– లింగా వెంకటరామిరెడ్డి, రిటైర్డ్ టీచర్

ఉర్దూ మీడియంలో చదువుకున్నా..



1942లో ఉర్దూ మీడియంలో మూడో తరగతి చదువుకున్నా. ఆ రోజుల్లోనే చదువు కోసం పోటీ పడ్డాం. సుర్దేపల్లి, బోదులబండ, మంగ్రాజుపల్లి నుంచి కూడా మా గ్రామం బడికి వచ్చేవారు.

– వి.అంజయ్య, సీనియర్ సిటిజన్

గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారు..



విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగులంతా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి కోసం కృషి చేయాలని ఉద్యోగులను కోరాం. మా పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలి.

– లంకెల శ్యామల, సర్పంచ్, రామచంద్రాపురం

క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయం



చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ బాల

రఘునాథపాలెం: క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమని ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల పిలుపునిచ్చారు. మండలంలోని చింతగుర్తిలో పునర్‌నిర్మించిన లూర్దుమాతా (ఆర్‌సీఎం) చర్చిని శనివారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. తొలుత బిషప్‌ను ఊరేగింపుగా తీసుకురాగా, స్థానిక సంఘ పెద్దలు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సర్పంచ్ మెంటం రామారావుతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అజ్మీరా వీరునాయక్, తుంపాల కృష్ణమోహన్, కె.వెంకటేశ్వరరావు, రవికిరణ్, మాలోత్ లక్ష్మీ, మాలోత్ రాంబాబు, జల్లేపల్లి సైదులు, తాతా వెంకటేశ్వర్లు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల విస్తృత పర్యటన



చిన్నారిని ఆశీర్వదిస్తున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌టీపీ నాయకులు విస్తృత పర్యటన చేశారు. శనివారం వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యక్తిగత సహాయకుడు సంద్యాల రవీందర్ రెడ్డి మంగళగూడెంలో పార్టీ నాయకుడు వెంకన్న కుమార్తె పుష్పాలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అదే విధంగా గోళ్లపాడులో అనారోగ్యంతో మృతి చెందిన బత్తిని భిక్షం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల కార్యదర్శి బత్తిని యాలాద్రి, మాజీ సర్పంచ్ మద్ది వీరారెడ్డి, మొక్క యాదగిరి, వెంకన్న,శేఖర్ పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



అల్లం నారాయణతో డెస్క్ జర్నలిస్టులు

ఖమ్మంసహకారనగర్: వివిధ పత్రికల్లో విధులు నిర్వర్తిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తారని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ స్పష్టం చేశారు. డెస్క్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న సబ్ ఎడిటర్లు టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణతో కలిసి శనివారం నగరానికి వచ్చిన అల్లం నారాయణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు ఖమ్మంలో ఇళ్ల స్థలాల పంపిణీకి శ్రీకారం చుట్టారని, మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, హరీశ్‌రావు ప్రక్రియను వేగవంతం చేశారని తెలిపారు. డెస్కుల్లో పనిచేసే వారిని కూడా వర్కింగ్ జర్నలిస్టులుగానే పరిగణనిస్తున్నందున ఇళ్ల స్థలాలు అందుతాయని చెప్పారు. అనంతరం సంఘం సత్తుపల్లి మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మగాని వంశీ, అచ్చిరెడ్డి, ఏకాంబరరావు, సాంబశివ, రాంబ్రహ్మాచారి, అంజి, రతన్, రాజేంద్రప్రసాద్, గోపి, జగదీశ్, కోటేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టర్లను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేవీ కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కొత్తగూడెం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా మసూద్‌ను ఎన్నుకున్నారు. ఉద్యమకారులు కూరపాటి రంగారావు, పాలకుర్తికృష్ణ, నరసయ్య, రయిస్ అన్వర్, నరేష్, అచ్చుతరావు, కాసాని నాగేశ్వరావు, పగడాల నరేందర్, అబ్బాస్, శ్రీను, పద్మాచారి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై యువకుల వీరంగం

నేలకొండపల్లి: అంతా నిద్రకు ఉపక్రమిస్తున్న వేళ నడిరోడ్డుపై ఒక్కసారిగా యువకులు వీరంగం సృష్టించడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. నేలకొండపల్లి మండలం సదాశివాపురం యువకులకు, నేలకొండపల్లికి చెందిన యువకులకు మధ్య గతంలో వివాదాలు ఉన్నాయి. సంక్రాంత్రి సందర్భంగా సదాశివాపురంలో డీజే దగ్గర ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది. ఆ రోజు ఘర్షణలో ఉన్న యువకుడు గురువారం రాత్రి నేలకొండపల్లి సెంటర్‌లో ప్రత్యర్థి వర్గానికి కనిపించడంతో స్థానికులు ఆయనపై దాడి చేశారు. ఈక్రమంలో అరుపులు, కేకలకు తోడు వాహనదారులు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో సెంటర్ రణరంగంగా మారింది. దాడిలో గాయపడిన యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాల నడుమ ప్రజాప్రతినిధులు రాజీ కుదిర్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

రహదారి దిగ్బంధంతో సత్తా చాటుదాం



నేలకొండపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈ నెల 13న చేపట్టిన జాతీయ రహదారులను దిగ్బంధంతో సత్తా చాటాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకుడు పగిడికత్తుల ఈదయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఈదయ్య మాట్లాడారు. అదేవిధంగా ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 27, 28 తేదీల్లో ఖమ్మం వైరా రోడ్డులోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర మహాసభలను మాదిగ, మాదిగ ఉపకులాలు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ కోరారు. బీసీ జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాస్కర్ మాట్లాడారు. బీజేపీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని ఆరోపించారు. మాదిగలను నయ వంచన చేసిన బీజేపీని తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జాతీయ రహదారుల దిగ్బంధనాన్ని విజయవంతం చేయాలని కోరారు. హైదరాబాద్ టూ వైజాగ్ రహదారిని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ 2014 నుంచి 2019 వరకు ఎన్నికల మేనిఫెస్టోలో వర్గీకరణ విషయాన్ని చేర్చారని కోరారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్న వర్గీకరణ గురించి నోరుమెదకపకోవటం దారుణమని, బీజేపీని గ్రామాల్లోకి రానివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ స్టూడెంట్ జాతీయ అధ్యక్షుడు దండు సురేంద్ర మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌మాదిగ, నరేష్‌కుమార్, వీరస్వామి, మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ శ్యామల, సంఘం నాయకులు వంగూరి ఆనందరావు, తోళ్ల సురేష్, వెంకన్న, జస్వంత్, రాము, సైదులు, సీతారాములు, సురేందర్, సిద్ధు, చిన్ని, వినయ్, మహేష్, భార్గవ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఏడీసీపీ సుభాష్‌చంద్రబోస్, యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం నగరంలోని బేబీమూన్ హైస్కూల్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్నతో కలిసి బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు సమాజంలో మానవ సంబంధాలపై అవగాహన కల్పించి భవిష్యత్తు తరాలకు మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వీరన్న, డైరెక్టర్లు కేసా భాస్కర్, కేసా సుగుణ, ఎస్.కమల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో ముగిసిన వర్క్‌షాప్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఐదు రోజులుగా స్వేచ్ఛా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న డేటా విజువలైజేషన్ యూసింగ్ పైథాన్ వర్క్‌షాప్ కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ప్రపంచంలో పైథాన్‌పై మరిన్ని ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి ఫౌండేషన్ సభ్యులను సన్మానించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ఫౌండేషన్ సభ్యుడు నరేంద్ర, కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు సుభాష్‌చందర్, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి: మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెరుకు తోటలోకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ముజ్జుగూడెంకు చెందిన షేక్ యాకూబ్‌మియా, రామచంద్రాపురం గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావు శనివారం ద్విచక్ర వాహనంపై నేలకొండపల్లి బయలుదేరారు. బోదులబండ శివారు వైకుంఠధామం వద్ద మూలమలుపులో వారి వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న చెరుకు తోటలోకి దూసుకెళ్లి పంట కాల్వలో పడింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా నేలకొండపల్లి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

కుటుంబపాలనకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న జితేంద్రకుమార్

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనను తరమికొట్టాలని, కుటుంబపాలనకు స్వస్తి పలకాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఖమ్మం నియోజకవర్గ పాలక్ కార్యక్రమం ఇన్‌చార్జ్ గార్లపాటి జితేంద్రకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని 6వ డివిజన్ రస్తోగినగర్‌లో ఖమ్మం అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. కుటుంబపాలనలో బందీ అయిన తెలంగాణ ప్రజలను విముక్తి చేయడానికి బీజేపీ 'ప్రజా గోస -బీజేపీ భరోసా'కార్యమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్రమంతా అన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ టౌన్ అధ్యక్షులు కుమిలి శ్రీనివాసరావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, అల్లిక అంజయ్య, సురేష్, వేజెండ్ల ప్రసాద్, సుగుణ, అరుణ, సుధాకర్, శేఖర్, కోటేశ్వరరావు, రమేష్, శేఖర్,కృష్ణ, పాపారావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న టీటీసీ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: 1984–85 సంవత్సరంలో టీటీసీ చదివిన విద్యార్థులు శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 37 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకొని రోజంతా నాటి స్మృతులను నెమరవేసుకుంటూ సందడిగా గడిపారు. ప్రస్తుతం వివిధ ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారుసైతం సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, కత్తి నెహ్రూ, వి.నిర్మల, సీతారామారావు, డి.శ్రీనివాస్, మహబూబ్ అలీ, నాగేందర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.


వడ్డెర సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

నేలకొండపల్లి: వడ్డెరలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా స్థానిక పోలీసులు పలువురు సంఘం నాయకులను శనివారం తెల్లవారుజామున ముందుస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంద గోవింద్ మాట్లాడారు. ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణచలేరన్నారు. సంఘం నాయకులు మండల నాయకులు బండి ఉపేందర్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.


శివనామస్మరణతో పాదయాత్ర

కూసుమంచి: మహాశివరాత్రిని పురస్కరించుకుని కూసుమంచి శివాలయంలో పలువురు భక్తులు శివమాలను ధరించారు. శనివారం మాలధారులు శివాలయం నుంచి జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల శివనామస్మరణతో కూసుమంచి నుంచి జీళ్ల చెరువు వరకు రహదారి మార్మోగింది.

వైభవంగా 'వీవీసీ' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



తల్లులతో కలిసి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రఘునాథపాలెం: వీవీసీ పాఠశాల 38వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సైనికులకు గౌరవ సూచికంగా చేసిన కథానికలో విద్యార్థులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అకడమిక్‌లో ప్రతిభ కనపరచి విద్యార్థులకు సర్టిఫికెట్లు, గోల్డ్‌మెడల్స్, క్రీడా విభాగంలో రాణించిన వారికి మెమెంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎస్.మధుసూదన్, శారద ఎడ్యుకేషనల్ విద్యాసంస్థల డైరెక్టర్లు, వీవీసీ పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేఖల భాస్కర్, ప్రిన్సిపాల్ విద్యాలత, వైస్ ప్రిన్సిపాల్ జీఏ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.